మేనేజ్‌మెంట్ కోటా.. వేలంపాట

- బహిరంగ మార్కెట్లో అమ్మకాల్లా సీట్ల విక్రయాలు
- ముందే అమ్మేసుకున్న కాలేజీలు
- నిబంధనలు పాటించవి వైనం
- ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ రాకముందే వక్రమార్గాలు
- మధ్యవర్తుల రంగప్రవేశం.. తల్లిదండ్రులకు ఫోన్లు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు అక్రమాలకు తెరలేపాయి. వేలంపాట తరహాలో సీట్లను విక్రయిస్తున్నాయి. సింహభాగం సీట్లను ఇప్పటికే అమ్మేసుకున్నాయి. తల్లిదండ్రులు అడిగితే.. ఆరా తీస్తే సీట్లు లేవు అని చెప్పేస్తున్నాయి. కనీసం దరఖాస్తు చేసుకునే అవకాశమివ్వడంలేదు. దరఖాస్తులిచ్చినా స్వీకరించడంలేదు. మరోవైపు కన్సల్టెంట్లు, మధ్యవర్తుల ద్వారా బేరసారాలు సాగిస్తున్నాయి. అంగట్లో అమ్మినట్టుగా, వేలం వేసినట్టుగా కంప్యూటర్ సైన్స్ సీట్లను కాలేజీలు అమ్ముతున్నాయి. ఈ సీట్లకున్న డిమాండ్‌తో ఫీజులు అడ్డగోలుగా పెంచాయి. ఇప్పుడు సీఎస్‌ఈ సీటు ఫీజు 16 లక్షలు పలుకుతుంది. ఒకప్పుడు

రూ.8-10 లక్షలున్న ఈ సీట్ల ఫీజులు తాజాగా రూ. 16 -18 లక్షలకు చేరాయి.

నోటిఫికేషన్ ఇవ్వకముందే..

నిబంధనల ప్రకారం బీ క్యాటగిరీ సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీచేస్తుంది. ఆ తర్వాతే కాలేజీలు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి, మెరిట్ ప్రకారం ఆయా సీట్లను భర్తీచేయాలి. కానీ ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ ఇవ్వకుండానే.. మెరిట్‌తో పనిలేకుండానే కాలేజీలు సంత తరహాలో సీట్లను విక్రయిస్తున్నాయి. రాష్ట్రంలో ఏ క్యాటగిరీ సీట్లను భర్తీ మొదలుకాకముందే. అసలు ఎప్‌సెట్ ఫలితాలు రాకముందే కాలేజీలు బేరాలు మొదలుపెట్టాయి. ఇక ఎప్‌సెట్ ఫలితాలు విడుదలకావడంతో ఈ సీట్లకు డిమాండ్ మరింత తీవ్రమైంది. బీ క్యాటగిరీ సీట్ల భర్తీలో మెరిట్ పాటించని ఇంజినీరింగ్ కాలేజీలకు నిరుడు తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) షాకిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా సీట్లు భర్తీచేయడాన్ని సీరియస్‌గా పరిగణించింది. మెరిట్ పాటించని మూడు కాలేజీలకు జరిమానా విధించింది. అయితే, ఏకంగా జరిమానాలు చెల్లించి చేతులు దులుపుకున్నాయి. ఇక ఉన్నత విద్యామండలి అధికారులు సైతం కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారు.

ర్యాటిఫికేషన్‌లో అక్రమాలు

బీ క్యాటగిరీ సీట్లను భర్తీచేసిన తర్వాత కాలేజీలు సీట్ల వివరాలను ఉన్నత విద్యామండలికి సమర్పిస్తాయి. ఉన్నత విద్యామండలి ఈ సీట్ల భర్తీలో కాలేజీలో నిబంధనలు పాటించాయా? లేదా? అని పరిశీలించాల్సి ఉంటుంది. కానీ ఉన్నత విద్యామండలి తూతూమంత్రంగా ర్యాటిఫికేషన్‌ను చేస్తుందన్న విమర్శలున్నాయి. దీని వెనుక పెద్ద దందా నడుస్తున్నదని, కొంత మందికి కాసులు ముడుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తే కొంత పారదర్శకతకు ఆస్కారముంటుందని, లేదంటే బీ క్యాటగిరీ సీట్లను కూడా కన్వీనరే భర్తీ చేస్తే ఈ దందాకు చెక్‌పడుతుందన్న వాదనలున్నాయి.

- షేక్‌పేటలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ సీటుపై ఆరా తీస్తే రూ. 14లక్షలు చెబుతున్నారు.
- నాగోలు బండ్లగూడ ప్రాంతంలోని మరో కాలేజీల్లో సీఎస్‌ఈ సీటుకు ఐదు లక్షల డొనేషన్ కట్టాల్సిందే. ఇక ఒక్కో సంవత్సరానికి ఫీజుగా 1.3లక్షలు చెల్లించాల్సిందే.
- నగరం నడిబొడ్డున ఉన్న మరో ఇంజినీరింగ్ కాలేజీలో సీటు విలువ రూ.12-16 లక్షలు పలుకుతుంది.
- గండిపేటలోని మరోకాలేజీలో సీఎస్‌ఈ సీటు రూ.18లక్షలపై మాటే. అసలు ఈ కాలేజీలో సీటు గురించి ఆరా తీస్తే లేదు అన్న సమాధానామే వస్తుంది.

టోల్ చార్జీలు 5% అదనం

- స్థానికుల నెలవారీ పాస్ రూ.10 పెంపు
- ఆదివారం అర్ధరాత్రి నుంచే అమలు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై టోల్ చార్జీలు 5% పెరిగాయి. ఏటా ఏప్రిల్ 1 నుంచి టోల్ చార్జీలను పెంచుతుంటారు. ఈ ఏడాది కూడా ఏప్రిల్ 1 నుంచే టోల్ చార్జీలను పెంచాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయించినప్పటికీ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆ నిర్ణయం తాత్కాలికంగా వాయిదా పడింది. జూన్ 1తో లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీల పెంపునకు అనుమతిస్తూ ఎన్‌హెచ్‌ఏఐ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కార్లు, జీపులు, వ్యాన్‌లకు టోల్ చార్జీ ఒక వైపు ప్రయాణానికి రూ.5, రెండు వైపులా ప్రయాణానికి రూ.10 చొప్పున పెరిగింది. బస్సులు, ట్రక్కులకు ఈ పెంపు రూ.25 (ఒకవైపు ప్రయాణానికి), రూ.35 (రెండు వైపులా ప్రయాణానికి), భారీ సరకు రవాణా వాహనాలకు రూ.35 (ఒకవైపు ప్రయాణానికి), రూ.50 (రెండు వైపులా ప్రయాణానికి)గా ఉన్నది. ఈ లెక్కన హైదరాబాద్ నుంచి విజయవాడకు కారు, వ్యాన్, జీపు, లైట్ మోటర్ వాహనంలో వెళ్లాలంటే పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్ ప్లాజాల్లో మొత్తంగా ఒకవైపునకు రూ.335, రెండువైపులా అయితే రూ.500 చొప్పున టోల్ చార్జి చెల్లించాల్సి ఉంటుంది. స్థానికుల నెలవారీ పాస్ ధరను రూ.330 నుంచి రూ.340కి పెంచిన ఎన్‌హెచ్‌ఏఐ.. 24 గంటల్లోపు తిరుగు ప్రయాణం చేసే అన్నిరకాల వాహనాలకు 25% రాయితీ ఇవ్వనున్నది. పెంచిన చార్జీలు వచ్చే ఏడాది మార్చి 31 వరకు అమల్లో ఉంటాయి.

వ్యాపార విస్తరణపై సింగరేణి దృష్టి

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణపై దృష్టి పెట్టింది. దీంట్లో భాగంగా ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో బొగ్గు గనులను చేపట్టేందుకు సిద్ధమవుతున్నది. దక్షిణాఫ్రికా, మొజాంబిక్, బోట్స్‌వానా, జింబాబ్వే, నైజీరియా, టాంజానియా వంటి దేశాలు గ్లోబల్ ర్యాంకింగ్‌లో ముందంజలో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కాంగో దేశానికి సింగరేణి ప్రతినిధి బృందాన్ని త్వరలోనే పంపించనుంది. బొలివియా, ఆస్ట్రేలియా దేశాలకు కూడా నిపుణుల బృందాన్ని పంపాలని భావిస్తున్నది. సింగరేణి సంస్థ తెలంగాణ వెలుపల ఇప్పటి వరకు ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాక్‌ను మాత్రమే చేపట్టింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఈ గనిని ప్రారంభించనుంది. ఈ ఒక్క గని నుంచి ఏడాదికి కోటి టన్నుల బొగ్గును సంస్థ ఉత్పత్తి చేయనుంది. ఈ ఏడాది కొత్తగూడెంలో వీకే ఓపెన్ కాస్ట్, రామగుండం రీజియన్‌లో రామగుండం కోల్‌మైన్, ఇల్లందు ఏరియాలో రొంపేడు ఓసీపీ, బెల్లంపల్లి ఏరియాలో గోలేటి ఓసీపీలు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ఇటీవలే భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్‌లో మరో ఓసీ కోసం ప్రత్యేకంగా అధ్యయనం చేయించింది. తాడిచెర్ల -2 బ్లాక్, చెన్నూరులో కొత్త బ్లాక్‌ను త్వరలోనే ప్రారంభించనున్నది.

కాంగ్రెస్ ‘మార్క్’ పేర్లు!

- పథకాల పేర్ల మార్పునకు సిద్ధమైన ప్రభుత్వం
- ఇందిర, రాజీవ్, అమ్మ వంటివి వచ్చేలా ప్లాన్
- దాదాపు అన్ని శాఖల్లో సిద్ధమైన నివేదికలు
- జూన్ 4 తర్వాత వరుసగా ప్రకటనలు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఆనవాళ్లను చెరిపివేసే క్రమంలో ప్రభుత్వ పథకాల్లో భారీగా మార్పులు, చేర్పులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో కొన్నింటిని పూర్తిగా తొలగించాలని, మరి కొన్నింటి పేర్లు మార్చి ‘కాంగ్రెస్’ మార్కు చూపెట్టాలని నిర్ణయించింది. ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ, హస్తం పేర్లు కలిసొచ్చేలా పథకాల పేర్లను మార్చనున్నట్టు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే ఆయా పథకాల జాబితాను అన్ని శాఖలు సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. ఇప్పటికే కొన్ని పథకాలను అంతర్గతంగా కొత్త పేర్లతో పిలుచుకుంటున్నారని, ఎన్నికల కోడ్ పూర్తయ్యాక అధికారికంగా ఉత్తర్వులు జారీ అవుతాయని చెప్తున్నారు. రద్దు చేయబోయే పథకాలనూ అధికారికంగా వెల్లడించే అవకాశం ఉన్నది.

- ఆసరా పెన్షన్ల పేరును ‘అభయ హస్తం’గా మార్చనున్నారు. ఇప్పటికే జనవరి నుంచి శాఖాపరంగా అంతర్గతంగా అభయ హస్తం పెన్షన్లు అనే సంబోధిస్తున్నారు. కలెక్టర్లు, ఇతర అధికారులకు ఇచ్చే మెసేజ్‌లలోనూ అభయ హస్తం అని పిలుస్తున్నారు.
- దేశంలోనే తొలిసారి రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు రైతుబంధును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ పథకాన్ని రైతు భరోసాగా మార్చి అమలు చేస్తామని కాంగ్రెస్ మొదటి నుంచే చెప్తున్నది. ఇటీవల వేసిన పెట్టుబడి సాయం సమయంలోనూ అంతర్గతంగా రైతుభరోసా పేరుతోనే పిలుచుకున్నారు.
- వైద్యారోగ్యశాఖలో అమలవుతున్న కేసీఆర్ కిట్ పథకాన్ని తాత్కాలికంగా ‘మదర్ అండ్ చైల్డ్ హెల్త్ కిట్’ పేరుతో అమలు చేస్తున్నారు. దీన్ని కేంద్రప్రభుత్వ పథకం ప్రధానమంత్రి మాతృవందన యోజనతో కలిపి కొత్త పేరుతో అమలు చేయాలని నిర్ణయించారట. ఇందిరమ్మ కిట్ లేదా అమ్మ కిట్ పేర్లను పరిశీలిస్తున్నట్టు సమాచారం.
- దళితులు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీనిని ప్రస్తుతం ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టేసింది. దీనిని పేరు మార్చి అంబేద్కర్ అభయహస్తం పేరుతో ప్రవేశపెడుతామని ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించింది.
- ఏటా మొక్కలను నాటి, పచ్చదనం పెంచేందుకు ఉద్దేశించిన తెలంగాణకు హరితహారం పథకం పేరును ‘ఇందిర వనప్రభ’గా మార్చుతారనే ప్రచారం జోరుగా సాగుతున్నది.
- ఇప్పటికే డబుల్ బెడ్రూం ఇండ్ల పథకాన్ని నిలిపివేసి.. ఇందిరమ్మ ఇండ్లుగా మార్చిన సంగతి తెలిసిందే.
- మన ఊరు మన బడి కార్యక్రమాన్ని ‘అమ్మ ఆదర్శ పాఠశాలలు’గా మార్చి అమలు చేస్తున్నారని చెప్తున్నారు.
- రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా తీసుకొచ్చిన ‘ధరణి’ పోర్టల్‌ను రద్దు చేసి ‘మా భూమి’ పోర్టల్‌ను ప్రవేశపెడతామని ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. అయితే ధరణిని పూర్తిగా రద్దు చేయడం సాధ్యం కాదని తేలడంతో, త్వరలో ‘మా భూమి’గా పేరు మార్చనున్నారు.
- విదేశాలకు వెళ్లి చదువుకోవాలనుకునే విద్యార్థులకు ప్రభుత్వం రూ.20 లక్షల వరకు స్కాలర్‌షిప్ అందించే విదేశీ విద్యానిధి పథకానికి సైతం కాంగ్రెస్ మార్క్ పేరు తేవాలని ప్రతిపాదించినట్టు తెలిసింది.

ప్రభాకర్‌రావును కలిసిన హరీశ్!

- గుట్టుచప్పుడు కాకుండా అమెరికా వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చింది?
- కలవలేదని ప్రమాణం చేస్తారా?
- ఫోన్ ట్యాపింగ్‌లో అప్రూవర్‌గా మారుతారనే బీఆర్‌ఎస్ భయం
- రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి ఆరోపణ



హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు అప్రూవర్‌గా మారుతారేమోనన్న భయంతో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు అమెరికా వెళ్లి ఆయనను కలిసి వచ్చారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసులో నిజాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయం బీఆర్‌ఎస్‌కు పట్టుకున్నదని ఆరోపించారు. కోమటిరెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్‌రావు అమెరికా వెళ్లి వచ్చిన వివరాలు అన్ని తన వద్ద ఉన్నాయని చెప్పారు. గతనెల 26న ఎమిరేట్స్ ఫ్లైట్ నంబరు ఈకే 525లో అమెరికాకు వెళ్లారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావును ఇండియాకు రాకుండా ఆపేందుకే హరీశ్‌రావు అమెరికా వెళ్లారని ఆరోపించారు. గుట్టుచప్పుడు కాకుండా ఆయన అమెరికా వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రభాకర్‌రావు ఎక్కడ అప్రూవర్‌గా మారుతారోనని భయపడుతున్నారని ఆరోపించారు. అమెరికా వెళ్లి ప్రభాకర్‌రావును కలవలేదని హరీశ్‌రావు ప్రమాణం చేస్తారా? అని మంత్రి కోమటిరెడ్డి సవాల్ విసిరారు.

రుజువు చేయకుంటే ముక్కు నేలకు రాస్తవా?

మొదటిపేజీ తరువాయి...

ప్రభాకర్‌రావుని కలిసినట్టు రుజువు చేస్తే అమరవీరుల స్థూపం ముందు ముక్కు నేలకు రాయడానికి తాను సిద్ధమని, రుజువు చేయకపోతే వెంకట్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పి అదే స్థూపం ముందు ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని చెప్పడానికి ఈ ఆరోపణ ఒక ఉదాహరణ అన్నారు. తాను కుటుంబసభ్యులతో కలిసి విదేశాలకు వెళ్లింది వాస్తవమని, అయితే తాము ప్రభాకర్‌రావును కలిసినట్టు మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడారని, ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టంచేశారు. తాను ఏ దేశం వెళ్లింది, ఏ హోటల్‌లో ఉన్నది.. తదితర వివరాలు ఇస్తానని, తన పాస్‌పోర్ట్‌తోసహా ఇతర వివరాలు తీసుకొని బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

పబ్లిసిటీ కోసం చౌకబారు ఆరోపణలు

పాస్‌పోర్టులో ఇమిగ్రేషన్ ఇన్ అండ్ ఔట్ వివరాలు ఉంటాయని, కనీస జ్ఞానం లేకుండా పబ్లిసిటీ కోసం కోమటిరెడ్డి మాట్లాడటం చౌకబారుతనమని హరీశ్‌రావు విమర్శించారు. కోమటిరెడ్డి కూడా తన దగ్గర ఉన్న ఆధారాలతో వచ్చి రుజువు చేయాలని, ఆధారాలతో రాని పక్షాన బేషరతుగా క్షమాపణ చెప్పి అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి ఎప్పుడు రమ్మంటే అప్పుడు అమరవీరుల స్థూపం వద్దకు వచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టంచేశారు. టీవీల్లో బ్రేకింగ్‌లు, స్క్రోలింగ్‌ల కోసం చిల్లర వ్యాఖ్యలు చేయడం మాని పాలనపై దృష్టి సారించాలని హితవుపలికారు. నిరాధార నిందలు వేసి తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలనుకొనే చిల్లర ప్రయత్నాలను కోమటిరెడ్డి మానుకొని హుందాతనాన్ని నిలుపుకోవాలని సూచించారు. ఆ భగవంతుడు మంత్రి వెంకట్‌రెడ్డికి సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుంటున్నట్టు హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఇప్పుడిచ్చేది ఒకటే యూనిఫాం

- జూన్ నెలాఖరులో విద్యార్థులకు మరో జత
- జిల్లాలకు చేరిన వస్త్రం సగమే.. కుట్టింది 40 శాతమే

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): పాఠశాలలు పునఃప్రారంభయ్యే జూన్ 12నే విద్యార్థులకు రెండుజతల యూనిఫాంలు ఇవ్వాలి. ఇది విద్యాశాఖ అధికారుల ఆదేశాలు. కానీ అధికారుల అలసత్వం, ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో ఒక జత యూనిఫాం మాత్రమే అందజేయనున్నారు. ఇక జూన్ నెలాఖరులో లేదంటే జూలై మొదటి వారంలో మరో జత ఇస్తారు. దీంతో కొత్త విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడుగుపెడుతున్న విద్యార్థులకు రెండు జతల యూనిఫాంల పంపిణీ కష్టంగానే కనబడుతుంది. రాష్ట్రంలో 2024 విద్యాసంవత్సరానికి దాదాపు 21లక్షల మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున యూనిఫాంలు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకు మొత్తం 90 లక్షల మీటర్ల వస్త్రం అవసరమని తేల్చింది. దీనిని టెస్కో ద్వారా సేకరిస్తున్నారు. కానీ కేవలం ఇందులో సగం..అంటే 45 లక్షల మీటర్ల వస్త్రం మాత్రమే జిల్లాలకు చేరింది. దీంతో కేవలం 40 శాతం యూనిఫాంలే సిద్ధమయ్యాయి. మిగిలిన 45 లక్షల మీటర్ల వస్త్రం జూన్ నెలాఖరులో అందనుంది.

పాత పద్ధతిలోనే డ్రైవింగ్ లైసెన్సులు

కేంద్ర మార్గదర్శకాలపై స్పందించని రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డ్రైవింగ్ లైసెన్సులను కొంత కాలంపాటు రవాణా శాఖ కార్యాలయాల్లోనే జారీ చేయనున్నారు. డ్రైవింగ్ లైసెన్సుల జారీని సరళతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ కొత్త మార్గదర్శకాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడమే ఇందుకు కారణం. దీంతో వాహనదారులు పాత పద్ధతిలోనే తొలుత లెర్నర్ లైసెన్సు కోసం స్లాట్ బుక్‌చేసుకొని, సంబంధిత ఆర్టీఏ కార్యాలయంలో రాత పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. ఆ తర్వాత నిర్ణీత గడువులోగా డ్రైవింగ్ టెస్టులో పాల్గొని పాసైతేనే శాశ్వత లైసెన్సు లభిస్తుంది.

కేంద్ర మార్గదర్శకాల ప్రకారమైతే..

డ్రైవింగ్ లైసెన్సు కోసం ఆర్టీవో కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఆర్టీఏ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రైవేటు డ్రైవింగ్ స్కూళ్లే వాహనదారులకు పరీక్షలు నిర్వహించి ధ్రువపత్రాలను జారీ చేస్తాయి. వాటితో లైసెన్సు కోసం ఆర్టీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఆర్టీఏలో రిజిస్ట్రేషన్ చేసుకోని స్కూళ్లలో డ్రైవింగ్ నేర్చుకున్నవారు మాత్రం పరీక్ష కోసం ఆర్టీఏ కార్యాలయానికి హాజరు కావాల్సిందే. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు నిబంధనలను నోటిఫై చేయాల్సి ఉంటుంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు 9 లక్షల పాత ప్రభుత్వ వాహనాలను దశలవారీగా తొలగిస్తారు. ర్యాష్‌గా డ్రైవింగ్ చేసినవారికి 1,000 నుంచి 2,000 వరకు జరిమానా విధిస్తారు. మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే 25 వేల పెనాల్టీ విధించడంతో పాటు సదరు వాహన యజమాని డ్రైవింగ్ రిజిస్ట్రేషన్ కార్డును రద్దు చేస్తారు. పట్టుబడిన మైనర్‌కు 25 ఏండ్ల వయసు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయరు.

రేవంత్‌వి అహంకార వ్యాఖ్యలు

- సోయిలేక మాట్లాడుతుండు
- కేసీఆర్ పేరు ఎత్తే అర్హత లేదు
- సీఎం తీరుపై బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): ఊహించని విధంగా ముఖ్యమంత్రి పదవి రావడంతో రేవంత్‌రెడ్డికి అహంకారం నెత్తికెక్కిందని, దాంతో మెదడు పాడైనట్టున్నదని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి విమర్శించారు. అందుకే అర్థం కాక.. సోయి లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ పేరు ఉచ్చరించే అర్హత కూడా రేవంత్‌రెడ్డికి లేదని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్‌పై అవాకులు చెవాకులు పేలుతున్నాడంటే.. కచ్చితంగా ఆయన మానసికస్థితిపై అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. తెలంగాణ కోసం పదవులు త్యాగం చేసి తెలంగాణ కోసమే పార్టీ పెట్టి.. తెలంగాణ కోసం ఆమరణ దీక్ష చేసి.. అన్ని వర్గాలను ఏకం చేసి.. దేశ పార్టీలన్నింటినీ ఒప్పించి.. మీకు తెలంగాణపై ప్రేమ లేదు, తెలంగాణ వారసత్వంపై గౌ రవం లేదు, అందుకే చార్మినార్, కాకతీయుల తోరణాన్ని రాజముద్ర నుంచి తొలగిస్తున్నారని విమర్శించారు. ఏనాడూ ఉద్యమంలో పాల్గొనని.. జై తెలంగాణ అనని రేవంత్‌రెడ్డి.. ఉద్యమం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడిన కేసీఆర్ కాలిగోటికి కూడా సరిపోరని చెప్పారు.

బీఆర్‌ఎస్ కార్యకర్త హత్య!

- కాంగ్రెస్ నేతల దాడిలో ప్రాణాలు వదిలిన ఈర్య
- భూవివాదాల ముసుగులో అధికార పార్టీ దౌర్జన్యం

మృతిచెందిన ఈర్య (ఫైల్)

రఘునాథపాలెం, జూన్ 2: భూ వివాదాల ముసుగులో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓ బీఆర్‌ఎస్ కార్యకర్తను హత్య చేశారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం శివాయిగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. శివాయిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త తేజావత్ హతీరాం.. కోయచలక రెవెన్యూ పరిధిలోని తన ఎకరం అసైన్డ్ భూమిని అదే గ్రామానికి చెందిన లాల్‌సింగ్ (బీఆర్‌ఎస్ కార్యకర్త)కు విక్రయించాడు. అసైన్డ్ భూమి కావడంతో తాను అమ్మిన భూమిని తిరిగి ఆక్రమించుకోవాలని హతీరాం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భుక్యా బాలాజీని ఆశ్రయించాడు. దీనిపై బాలాజీ చర్చలకు తమ ఇంటికి రావాలని లాల్‌సింగ్‌ను ఆదేశించాడు. తనకు అన్యాయం జరుగుతుందని భావించిన లాల్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడు. దీంతో అక్కసుతో లాల్‌సింగ్‌కు అనుకూలుడైన సీఆర్‌పీఎఫ్ జవాన్ మాలోతు రవి బయటకు వెళ్లి వస్తుండగా.. కాంగ్రెస్ కార్యకర్తలు బానోతు దశరథ్, బానోతు రమేశ్, భుక్యా బాలాజీ, విజయ్, ఉమ కలిసి అతడిపై దాడి చేశారు. అడ్డుగా వచ్చిన జవాన్ రవి భార్యను అందరి ముందే వివస్త్రను చేశారు. రవిపై దాడి చేస్తుండటాన్ని గమనించిన అతడి పెద్దనాన్న తేజావత్ ఈర్య అలియాస్ పాప (55) (గ్రామ బీఆర్‌ఎస్ మాజీ ఉప సర్పంచ్ శారద మామ) అడ్డుకోగా.. కాంగ్రెస్ కార్యకర్త తేజావత్ దశరథ్ అతడి ఛాతీపై బలంగా కొట్టడంతో కింద పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. ఉద్దేశపూర్వకంగానే దాడి చేసి బీఆర్‌ఎస్ కార్యకర్తను హతమార్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు ఇల్లెందు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



- **సోనియా, రేవంత్‌కు కాంగ్రెస్ శ్రేణుల నివాళి!**

రాష్ట్ర అవతరణ వేడుకల్లో గజ్వేల్ కాంగ్రెస్ కార్యకర్తలు అత్యుత్సాహం చూపారు. తెలంగాణ అమరుల త్యాగాలను గుర్తు చేసుకోవడం మరిచి జాతీయజెండా గద్దె వద్ద ఏఐసీసీ అధినేత్రి సోనియా, సీఎం రేవంత్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించినట్టుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లిలో చోటుచేసుకుంది. - గజ్వేల్

బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌పై దుండగుల దాడి

దవాఖానలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పరామర్శ

మంచిర్యాలటౌన్, జూన్ 2: మంచిర్యాల జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి గడప రాకేశ్‌పై దుండగులు విచక్షణా రహితంగా దాడి చేశారు. హైటెక్ కాలనీలో నివాసముంటున్న రాకేశ్ ఆదివారం ఉదయం ఐదున్నర గంటలకు తన కారులో జిమ్‌కు బయలుదేరారు. లక్ష్మీటాకీసు చౌరస్తా సమీపంలోకి రాగానే ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి రాకేశ్ ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టాడు. ఏం జరిగిందోనని తెలుసుకోవడానికి కారు దిగగా.. ఒక్కసారిగా 15 మందికిపైగా దుండగులు బేస్‌బాల్ కర్రలు, ఇనుప రాడ్‌లతో ఇష్టారీతిన రాకేశ్‌పై దాడి చేశారు. కారు అద్దాలను పగులగొట్టారు. తలకు, పొట్టకు కర్రలు, రాడ్‌లు తగలకుండా రాకేశ్ జాగ్రత్తపడ్డారు. అప్పటికే రోడ్డుపై ఉన్న జనం పెద్దగా అరవడంతో వారంతా పారిపోయారు. రాకేశ్‌ను సమీపంలోని జైసాయి దవాఖానకు తరలించారు. తనపై దాడికి పాల్పడింది వంశీ, చందు, సంజీవ్, రవి అని రాకేశ్ తెలిపారు. వారితో తనకు పెద్దగా పరిచయం లేదని, కానీ తాను బీఆర్‌ఎస్‌లో చురుకుగా పనిచేసినందుకే కక్షతో దాడి చేసి ఉంటారని, కాంగ్రెస్ పార్టీకి చెందినవారేనని అనుమానం వ్యక్తం చేశారు. సీఐ బన్సీలాల్, ఎస్సైలు దవాఖానకు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశారు. రాకేశ్‌పై దాడి వెనుక మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు హస్తం ఉందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. మంచిర్యాల దవాఖానలో చికిత్స పొందుతున్న రాకేశ్‌ను బీఆర్‌ఎస్ నేత, ఆయన కుమారుడు విజిత్‌రావుతో కలిసి పరామర్శించారు. పథకం ప్రకారమే దాడిచేశారని, మంచిర్యాలలో అలజడి సృష్టిస్తున్నారని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



రాకేశ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, విజిత్‌రావు

ఉమ్మడి రాజధానిగా పదేండ్లు పొడిగించాలి

- ఏపీ పార్టీలు కలిసి పోరాడాలి
- మాజీ మంత్రి శైలజానాథ్

హైదరాబాద్,జూన్1 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానికిగా మరో పదేండ్లు పొడిగించాలని, దీనికోసం ఏపీలోని అన్ని పార్టీలు ఐక్యంగా పోరడాలని మాజీ ఏపీసీసీ చీఫ్ డాక్టర్ సాకే శైలజానాథ్ తెలిపారు. ఏపీతో తెలంగాణకు ఉన్న ఉమ్మడి రాజధాని బంధం ఆదివారంతో ముగియనుండటంతో శైలజానాథ్ విచారం వ్యక్తం చేశారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలు పరిష్కరించకుండానే శాశ్వత ముగింపు పడిందని వాపోయారు. ఎంసెట్ సహా 7 రకాల ప్రవేశ పరీక్షలకు ఈ ఒక్క ఏడాది మాత్రమే ఏపీ విద్యార్థులకు తెలంగాణలో సీట్లు కేటాయిస్తారని, వచ్చే ఏడాది నుంచి విద్యార్థుల భవిష్యత్తు అయోమయంలో పడిపోయిందని శైలజానాథ్ ఆరోపించారు.

మోటర్లు నడుపాలె.. నిధులివ్వండి!

మొదటిపేజీ తరువాయి...

పూర్తయింది. వీటి పనితీరును పరీక్షించేందుకు, విడిభాగాలను సంరక్షించేందుకు డ్రై రన్ నిర్వహించాల్సి ఉంది. ఏవైనా లోపాలుంటే మోటర్లు సరఫరా చేసిన ఏజెన్సీలతోనే మరమ్మతులు చేయించాల్సి ఉంటుంది. అన్నీ సిద్ధమైన తర్వాత పంపుల వెట్‌రన్ నిర్వహించాలి. ఈ క్రమంలో ప్రస్తుతం ఆయా ఎత్తిపోతల పథకాల్లో మోటర్ల బిగింపు పూర్తయినా డ్రై రన్ కోసం అధికారులు నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. ఆయా పంపింగ్ స్టేషన్లకు పవర్ సర్వీస్ కనెక్షన్ లేకపోవడమే ఇందుకు కారణం. ఎన్పీడీసీఎల్, టీఎస్ ట్రాన్స్‌కోకు సర్వీస్ కనెక్షన్ చార్జీలు చెల్లించాలని, మోటర్లను తిప్పిచూడాల్సి ఉందని ప్రభుత్వానికి అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. సర్వీస్ కనెక్షన్ కోసం ఏ మేరకు నిధులు కావాలో ప్రతిపాదనలు కూడా పంపారు.

‘సీతారామ’కు రూ.22కోట్లు

ఈ పథకంలో మొత్తం మూడు పంపింగ్ స్టేషన్లున్నాయి. మొదటి స్టేషన్‌లో 25మెగావాట్ల సామర్థ్యం గల 6 సింక్రోనస్ మోటర్‌తో కూడిన వాల్యూట్ పంపులను, రెండో స్టేషన్‌లో 40మెగావాట్ల సామర్థ్యం గల 6 సింక్రోనస్ మోటర్లతో కూడిన ఫ్రాన్సిస్ టర్బైన్ పంపులు, మూడో స్టేషన్‌లో 40మెగావాట్ల సామర్థ్యం గలవి 5,30 మెగావాట్ల సామర్థ్యం గల 2 ఫ్రాన్సిస్ టర్బైన్ పంపులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇవి డ్రైరన్‌కు సిద్ధంగా ఉన్నాయి. కానీ, పంపింగ్ స్టేషన్లకు ఇప్పటివరకు పవర్ సర్వీస్ కనెక్షన్ ఏర్పాటు చేయలేదు. సర్వీస్ కనెక్షన్ కోసం మొత్తం రూ.22కోట్లను విద్యుత్ పంపిణీ సంస్థకు చెల్లించాల్సి ఉంది. ఆ నిధులను చెల్లించకపోవడంతో ట్రాన్స్‌కో సర్వీస్ కనెక్షన్ ఇవ్వడం లేదు.

పాలమూరుకు రూ.124కోట్లు

ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో మొత్తం నాలుగు పంపింగ్ స్టేషన్లు ఉండగా, ఉద్దండాపూర్ మినహా మూడు సిద్ధమయ్యాయి. నార్లాపూర్ పంపింగ్ స్టేషన్ 145 మెగావాట్ల సామర్థ్యంతో 8, ఏదుల పంపింగ్ స్టేషన్ 9, వట్టెం పంపింగ్ స్టేషన్‌లో 9 పంపులు ఏర్పాటు చేశారు. డ్రైరన్ కోసం ఇవికూడా సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే పంపింగ్ స్టేషన్-1 (నార్లాపూర్)లో రెండు పంపులను డ్రైరన్, వెట్‌రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఏదుల, వట్టెం పంపుల డ్రై రన్, వెట్ రన్ కోసం విద్యుత్ సరఫరా లేక ప్రక్రియ నిలిపివేశారు. వీటికి సర్వీస్ కనెక్షన్ ఇవ్వాలంటే ఒక్కో పంపింగ్ స్టేషన్‌కు దాదాపు రూ.62 కోట్లు చెల్లించాల్సి ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. మొత్తంగా రూ.124కోట్లు విడుదల చేస్తే డ్రైరన్, వెట్‌రన్ నిర్వహిస్తామని చెబుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదని చెబుతున్నారు. పంపులను సరఫరా చేసిన ఏజెన్సీల అగ్రిమెంట్ పూర్తికాకముందే డ్రైరన్, వెట్‌రన్ నిర్వహించాలని, ఏవైనా లోపాలు తలెత్తినా, మరమ్మతులు చేయాల్సి ఉన్నా సదరు ఏజెన్సీతోనే చేయించే అవకాశముంటుందని తెలుపుతున్నారు. ప్రభుత్వం వెంటనే ట్రాన్స్‌కోకు నిధులు చెల్లించి పంపింగ్ స్టేషన్లకు సర్వీస్ కనెక్షన్ ఇప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.